ఓ మాతా నీవు కావాలి ...

# శివశక్తి స్వరూపిణి



# మీ భాగ్యం ఎంత శ్రేష్టం !

మాతలు సదా స్వయాన్ని పదమాపద భాగ్యవంతులుగా భావిస్తున్నారా? ఇంట్లో కూర్చుని ఉండగానే బాబా లభించారంటే ఎంత గొప్ప భాగ్యం! ప్రపంచంలోని వారు బాబాని వెతకటం కోసం అంతా తిరుగుతారు కానీ మీకు ఇంట్లో ఉండగానే బాబా లభించారు. ఇంత గొప్ప భాగ్యం ప్రాప్తిస్తుంది అని సంకల్పంలోనైనా ఆలోచించారా? ఇంట్లో ఉండగానే భగవంతుడు లభించారు ... అనే ఈ మహిమ ఎవరిది? మీదే కదా! ఈ శ్రేష్ట భాగ్యాన్ని గుర్తు ఉంచుకుని ముందుకి వెళ్తూ ఉండండి. ఓహో నా శ్రేష్ట భాగ్యం! అనే పాట పాడుతూ ఉండండి. సంతోషమనే ఊయలలో ఊగుతూ ఉండండి.

మాతలకు విశేషంగా ఏ ఖజానా లభించింది? సంతోషమనే ఖజానా లభించింది కదా! ఈ ఖజానా విశేషంగా మాతల కొరకే. కనుక ఆ సంతోష ఖజానాతో ఆడుకుంటూ ఉండండి, పంచుతూ ఉండండి; మీ పని ఇదే. ఇంట్లో పని చేసుకుంటూ కూడా సంతోష ధనాన్ని పంచుతూ ఉండండి, అప్పుడు ఆ ఇంటి పని కూడా ఆటగా అనిపిస్తుంది. ఆటలో అలసట ఉండదు, సదా ఇలా ముందుకి వెళ్తూ ఉండండి. సాధారణ మాతలు కాదు మీరు, శివశక్తులు. శక్తి అనగా సంహారిణి మరియు విజయీ. విజయీ జెండా ఎగురవేసేవారు. విశ్వంలో బాబాని ప్రత్యక్షం చేసేవారు. ప్రవృత్తిని సంభాళిస్తూ కూడా మేము అసురీ సంహారిణి, శివశక్తులం అనే బేహద్ నషా సదా ఉండాలి.

సదా మీ యొక్క భాగ్యాన్ని స్మృతిలో ఉంచుకుని సంతోషంగా ఉండండి. సంతోషంతో మనసులో సదా పాటలు పాడుకుంటూ ఉండాలి. బ్రాహ్మణులుగా అయిపోయారు కనుక పాడుకోవటం, నాట్యం చేయటం ఇదే మీ పని. ఒక్కొక్క జగన్మాత ఒక్కొక్క దీపాన్ని (ఆత్మదీపం) వెలిగిస్తే ఎన్ని దీపాలు వెలుగుతాయి! జగన్మాతలు జగమంతటి దీపాలు వెలిగిస్తున్నారు కదా!

శక్తులకు సదా ఏ సంతోషం ఉంటుంది? సదా బాబాతో పాటు మీరు కంబైండ్, శివశక్తి అంటేనే కంబైండ్. బాబా మరియు మీరు ఇద్దరినీ కలిపి శివశక్తి అని అంటారు. కలిసి ఉన్నవారిని ఎవరూ వేరు చేయలేరు. ఇటువంటి సంతోషం ఉంటుందా? నిర్బల ఆత్మను బాబా శక్తి ఆత్మగా చేశారు. మేము బాబాతో పాటు కలిసి ఉండే అధికారులం అయిపోయాం అనే నషాలో ఉండండి. మాయ ఎంతగా ప్రయత్నించినా కానీ శివశక్తి ముందు మాయ ఏమీ చేయలేదు. వేరుగా ఉంటేనే మాయ వస్తుంది. బాబాతో కలిసి ఉంటే మాయ రాలేదు. మేము శివశక్తులం, విజయీలం అనే వరదానాన్ని స్మృతిలో ఉంచుకోండి.

శక్తిసేనకి బాప్‌దాదా విశేషంగా ఎక్కేకళ యొక్క సహయోగం ఎందుకు ఇస్తారు? ఎందుకంటే శక్తులను, మాతలను అందరు క్రిందికి పడేసారు ఇప్పుడు బాబా వచ్చి పైకి ఎక్కిస్తున్నారు తన కంటే కూడా ముందుగా శక్తులను పెడుతున్నారు అందువలన శక్తులకు విశేషంగా సంతోషం ఉండాలి. శక్తుల ముఖం సదా మెరుస్తూ కనిపించాలి ఎందుకంటే బాబా మిమ్మల్ని విశేషంగా ముందు పెట్టారు. అల్పకాలిక ప్రాప్తి యొక్క మెరుపు ముఖంలో కనిపిస్తుంది కానీ ఇది ఎంత గొప్ప ప్రాప్తి!

మాతలు మరియు కన్యలు విశేషంగా అదృష్టవంతులు ఎందుకంటే వీరు అందరికంటే బీదవారు అందుకే బాబాని కూడా పేదల పాలిట పెన్నిధి అంటారు ధనవంతుల పెన్నిధి అని అనరు. పేదలు త్వరగా పదవిని పొందగలుగుతారు కనుక పేదలే అదృష్టవంతులు. సంగమయుగంలో కుమారీగా లేదా మాతగా అవ్వటం అదృష్టం. చరిత్రలో కూడా గోపీవల్లభునితో పాటు గోపికలనే ఎక్కువ చూపించారు, గోపకులు తక్కువ కనుక గోపిక తనువులో ఉండే మీరు అదృష్టవంతులు. ఈ సంగమయుగంలో శక్తులు ముందు అనేది బాప్‌దాదా యొక్క సూక్తి. స్వయం బ్రహ్మాబాబా కూడా అన్నింటినీ మాతలకు సమర్పణ చేసారు కనుక మీరు ఇంత అదృష్టవంతులు. మీ ఈ అదృష్టం గురించి తెలుసా? అలా భావించి నడుస్తున్నారా? మాతల కర్తవ్యం తక్కువైనది కాదు.

శివబాబాతో పాటు పాత్రను అభినయించే మాతలు మీరు. ఇంత నషా ఉందా? ఇంత సంతోషం ఉందా? ఈ స్థితిలో ఉంటే సంతోషంలో ఎగురుతూ ఉంటారు.

శక్తులు లేదా గోపికలకు స్మృతిచిహ్నం - సంతోషంతో నాట్యం చేయటం అందువలనే పాదాలకు గజ్జెలు కట్టుకుని నాట్యం చేస్తున్నట్లు చూపించారు. సదా సంతోషం ఎవరికి ఉంటుంది? ఎవరైతే స్వయాన్ని గోపికగా భావిస్తారో వారికి ఉంటుంది. గోపిక అంటే సదా గోపీవల్లభునితోనే సంలగ్నత ఉన్నవారు కనుక స్వయాన్ని గృహస్థీ మాతగా కాదు గోపికగా భావించండి. గృహస్థీ అనే మాట బావుండదు. గోపికలు అనే పేరు వినగానే అందరు సంతోషం అయిపోతారు ఆ పేరు విన్నవారే అంత సంతోషం అయిపోతుంటే స్వయం గోపికలు ఎంత సంతోషంగా ఉంటారు!

మాతలకు నషా ఉందా? ఎలాంటి వారు ఎలాంటి వారిగా అయ్యారు! మాతలను ప్రజలు క్రిందికి పడేసారో, పాదాల క్రింద చెప్పుగా చేసారో పాదాలు అన్నింటికంటే క్రింద ఉంటాయి. చెప్పులు పాదాల కంటే కూడా క్రింద ఉంటాయి అటువంటి వారిని బాబా శిరోకిరీటాలుగా

తయారుచేసారు కనుక మాతలకు ఎక్కువ సంతోషం ఉంది కదా! సంతోషంలో నాట్యం చేస్తారు మరి మీరు నాట్యం చేస్తున్నారా? పాదాలతో కాదు, మనస్సుతో, సంతోషంతో నాట్యం చేయండి. బాబా లభించారు అన్నీ లభించాయి. ఈరోజు విశ్వంలో అన్నీ లభిస్తున్నాయి కానీ సత్యమైన సంతోషం లభించటంలేదు. మీకు సత్యమైన సంతోషం లభించింది.

మీ మహిమ గురించి మీకు తెలుసా? మాతలు లేకపోతే బాబాని గోపాలుడు అని అనరు. మాతల కారణంగానే గోపాలుడు అని పేరు వచ్చింది. గోపాలుడికి ప్రియమైనవారు మీరు. మురళి వింటూ నాట్యం చేసేవారు. మురళి అంటే మీకు చాలా ప్రేమ కదా! మరళి లేకుండా ఉండలేరు. ఎవరికి మురళిపై ప్రేమ ఉంటుందో వారికి మురళీధరునిపై కూడా ప్రేమ ఉంటుంది. ఎవరికి మురళిధరునిపై ప్రేమ ఉంటుందో వారికి సేవపై కూడా ప్రేమ ఉంటుంది. మురళీలో లీనమైపోయిన వారు పాత ప్రపంచాన్ని సహజంగా మర్చిపోతారు. ప్రపంచమంతా నిద్రపోతుంది మీరు ఆనందంలో ఉంటున్నారు. మాతలలో చదువుపై మంచి అభిరుచి ఉంది.

ఇంట్లో కూర్చుని ఉండగానే భగవంతుడు లభించారు దీని కంటే గొప్పభాగ్యం ఇంకేముంటుంది? ఈ భాగ్యాన్ని స్మృతిలో ఉంచుకుని హర్షితంగా ఉండండి అప్పుడు దు:ఖము, అశాంతి సదాకాలికంగా సమాప్తమైపోతాయి. మాతలు సదా బాబాతో పాటు సంతోషమనే ఊయలలో ఊగేవారు కదా? గోప, గోపికలు సదా సంతోషంతో నాట్యం చేస్తూ ఉంటారు లేదా ఊయలలో ఊగుతూ ఉంటారు. సదా బాబాతో పాటు ఉండేవారు సంతోషంతో నాట్యం చేస్తూ ఉంటారు.

మాతలు సదా మీ యొక్క శ్రేష్టభాగ్యాన్ని చూసుకుని హర్షితంగా ఉంటున్నారా? పాదాల దగ్గర దాసీగా ఉండేవారు శిరోకిరీటంగా అయ్యారు ఈ సంతోషం సదా ఉంటుందా? సంతోష ఖజానాను ఎవరు దొంగలించటం లేదు కదా? దొంగలించటంలో మాయ తెలివైనది. సదా శక్తిశాలిగా, తెలివిగా ఉంటే మాయ ఏమీ చేయలేదు, దాసీఅయిపోతుంది. శత్రువు నుండి సేవాధారిగా అయిపోతుంది.

మాతలకు ఎంత శ్రేష్టప్రాప్తి లభించింది. చేతులు పూర్తిగా ఖాళీ అయిపోయిన వారు ఇప్పుడు సంపన్నం అయిపోయారు. అన్నీ పోగొట్టుకున్నారు ఇప్పుడు తిరిగి బాబా నుండి సర్వఖజానాలు పొంది ఎలాంటి మాతలు ఎలాంటి వారిగా అయ్యారు! నాలుగు గోడల మధ్య ఉండేవారు విశ్వయజమానులు అయిపోయారు. బాబా మమ్మల్ని తన వారిగా చేరుకున్నారంటే ఎంత భాగ్యం అనే నషా ఉంటుంది కదా?

మా కోసమే బాబా వచ్చారు అని మాతలకు విశేషంగా సంతోషంగా ఉండాలి. ఇతరులు ఎవరైతే వచ్చారో వారందరు పురుషులను ముందు పెట్టారు, ధర్మపితలు ధర్మస్థాపన చేసి వెళ్ళిపోయారు. మాతలను ఎవరు కూడా ప్రసిద్ధమైన వారిగా చేయలేదు కానీ బాబా " మొదట మాతలు" అనే విధానాన్ని స్థాపన చేసారు. మాతలు గారాభమైనవారు అయిపోయారు.ఎంత దయతో బాబా వెతికారు తన వారిగా చేసుకున్నారు.

మాతలను చూసి బాప్‌దాదాకి గర్వంగా ఉంటుంది. నిరాశలో ఉండేవారు ఇప్పుడు ఆశావంతులు అయ్యారు. విశ్వకళ్యాణకారి అయ్యారు. ఇప్పుడు విశ్వం మీ వైపు చూస్తుంది. మాకు కళ్యాణం చేసే మాతలు ఎక్కడ ఉన్నారు అని. కనుక ఇప్పుడు జగన్మాతలై జగుత్తుకి కళ్యాణం చేయండి.

మాతలకు అవినాశి సౌభాగ్య తిలకం పెట్టబడి ఉంది. లౌకికంలో సౌభాగ్యానికి గుర్తు – తిలకం. ఇప్పుడు అవినాశి సౌభాగ్యం అంటే సదా స్మృతి తిలకం పెట్టుకుని ఉండటం. ఇటువంటి సౌభాగ్యవంతులు సదా భాగ్యవంతులు. కల్పకల్పాలకు భాగ్యవంతులు. మీ భాగ్యం ఎవరు దొంగిలించలేనిది. రాజ్యం మీది, భాగ్యం మీది, భగవంతుడు మీ వారు. అటువంటి మీరు అధికారి ఆత్మలు. అధికారిగా ఉంటే ఆధీనత ఉండదు.

మధురాతిమధురమైన మాతలందరికీ బాప్‌దాదా ఆశీర్వాదాలు మరియు ప్రియస్మృతులు ఇస్తున్నారు. మాతలే అలంకరణ. మాతలు లేకపోతే అలంకరణే లేదు. మధువనానికి అయినా, సెంటర్‌కి అయినా మాతలే అలంకరణ.

మాతల కొరకే స్వయంగా బాబా సృష్టిపైకి వచ్చారు. మేము పిలిచాం అందువలనే బాబా రావలసి వచ్చింది అని సంతోషం ఉంది కదా! ఎందుకు? దు:ఖం కారణంగా మాతలు మనస్సుతో బాబాని పిలిచారు, అలా పిలిచేటటువంటి ఆత్మలను పూజ్యులుగా తయారుచేశారు బాబా, పిలవటం నుండి ముక్తుల్ని చేశారు, ఇప్పుడు పిలవవలసిన అవసరం లేదు. ఆశలన్నీ పూర్తయిపోయాయి. బాబా లభించారు అన్నీ లభించాయి. సదా ఇదే సంతోషంలో ఉంటూ సంతోషాన్ని దానమిస్తూ ఉండండి.

మాతలను చూసి బాప్‌దాదాకి చాలా సంతోషంగా ఉంటుంది. పాదాల వరకు పడిపోయిన వారిని ఒక్కసారిగా శిరోకిరీటాలుగా చేశారు. బాగా కిందకి పడిపోయినవారు బాగా పైకి ఎక్కితే

చాలా సంతోషం ఉంటుంది కదా! సంతోషం అనే ఊయల మాతల కొరకే. విశేషంగా ముందుకి వెళ్ళే బహుమతి బాబా ద్వారా మాతలకే లభించింది. కొద్దిపాటి పురుషార్ధం మీది, వేలరెట్లు సహాయం బాబాది. ఒక అడుగు మీది, వేల అడుగులు బాబావి.

శక్తిసేనను చూసి బాప్‌దాదాకి గర్వంగా ఉంది. ఎవరినైతే ప్రజలు నిరాశగా వదిలేశారో బాబా వారిని ఆశావంతులుగా చేశారు. మొదట శక్తులు, తర్వాత శివుడు, తనని తాను కూడా వెనుక పెట్టుకున్నారు. ఇటువంటి శివబాబాని ఎప్పుడూ మర్చిపోకూడదు. సదా కంబైండ్ రూపాన్ని చూడండి, కంబైండ్ రూపంలో నడవండి.

శక్తులైన మీరు మీ శక్తి రూపంలోకి వచ్చేస్తే ప్రపంచమంతా మీ తరంగాలు వ్యాపిస్తాయి. గృహస్థంలో ఉంటూ నిమిత్తంగా ఉన్నట్లయితే అతీతంగా ఉంటారు మరియు ఇతరుల జీవితాన్ని సఫలం చేయడానికి కూడా నిమిత్తమవుతారు. మేము కల్పపూర్వపు గోపికలం అని సదా ఇదే స్మృతిలో ఉండండి. శక్తుల యొక్క ముఖ్య గుణం - నిర్భయత. మాయతో భయపడేవారు కాదు. అటువంటి నిర్భయులేనా? మాయ సింహం రూపంలో వచ్చినా కానీ అంటే వికార రూపంలో వచ్చినా కానీ శక్తులు ఆ సింహంపై స్వారీ చేసేవారు. అంత నిర్భయులు. ఎవరైతే నిర్భయులుగా ఉంటారో వారి శక్తిరూపం సాక్షాత్కారం అవుతుంది. ప్రపంచంలోని వారు ఆ రూపంలోనే మీకు నమస్కరించడానికి వస్తారు.

ఎప్పటి నుండి మాతలపై బాప్‌దాదా దృష్టి వేసారో అప్పటి నుండే ప్రపంచం వారు కూడా స్త్రీలు ముందు అనే సూక్తి పెట్టారు. భారతరాజ్యనీతిలో కూడా చూడండి, పురుషులందరు నారీలను మహిమ చేస్తారు.ఒక్క లెక్కతో చూస్తే పాండవులు కూడా నారీలే. పరమాత్మ పురుషుడైతే ఆత్మ నారి కదా! ఆత్మ చెప్తుంది అంటారు కానీ ఆత్మ చెప్తున్నాడు అని అనరు కదా! పరమాత్మ ముందు ఆత్మ నారి అంటే ప్రేయసి.

మాతలను చూసి బాప్‌దాదాకి సంతోషంగా ఉంటుంది, ఎందుకు? ఎందుకంటే సంగమయుగంలో బాప్‌దాదా ద్వారా మాతలకే అవకాశం లభిస్తుంది. ద్వాపర కలియుగాల్లో లభించలేదు, ఇప్పుడు లభిస్తుంది. మహాత్మలలో కూడా మాతలకు రోజురోజుకి అవకాశం లభిస్తుంది, ప్రభుత్వంలో కూడా మాతలకు అవకాశం లభిస్తుంది. బాప్‌దాదా సదా చెప్తుంటారు - మాతలు ఏ సెంటర్‌లో ఉంటారో ఆ సెంటరు ఫలీభూతం అవుతుంది. వారు సంపాదించకపోయినా కానీ మనస్సు విశాలంగా ఉంటుంది, భావన బావుంటుంది. బాబా కూడా భావన మరియు సత్యమైన మనస్సుని ఇష్టపడతారు.

# ఏమిటి మీ కర్తవ్యం !

మాతలందరు జగన్మాతలు అయిపోయారా? హద్దులోని గృహస్థం యొక్క మాతలు కాదు మీరు. సదా విశ్వకళ్యాణకారీలు. బాబా ఏవిధంగా అయితే విశ్వకళ్యాణకారియో అదేవిధంగా పిల్లలైన మీరు కూడా విశ్వకళ్యాణకారి. ఇంట్లో ఉంటున్నారా లేక విశ్వం యొక్క సేవాస్థానంలో ఉంటున్నారా? విశ్వమే మీ సేవాస్థానం. మీరు బేహద్‌లో ఉండేవారు, హద్దులో ఉండేవారు కాదు. ఎక్కువ సమయం దేనిలో వెళ్తుంది? హద్దులోని ప్రవృత్తిలోనా లేదా బేహద్ ప్రవృత్తిలోనా? ఎంతగా బేహద్ లక్ష్యం ఉంచుకుంటారో అంతగా హద్దులోని బంధనాల నుండి సహజంగా ముక్తులైపోతూ ఉంటారు. సమయం దొరకటం లేదు అని ఇప్పుడు సంకల్పం వస్తుంది, కోరిక ఉంది కానీ శరీరం సహకరించటంలేదు, శక్తి లేదు...... ఇవన్నీ బంధనాలు. నేను బేహద్‌సేవలోకి రావల్సిందే అని ధృడసంకల్పం తీసుకుంటే, సంలగ్నత ఉంటే ఈ బంధనాలన్నీ సెకనులో సమాప్తి అయిపోతాయి. సమయం స్వతహాగానే దొరుకుతుంది, శరీరం స్వతహాగానే సహకరిస్తుంది. ఈ అనుభవం మీకు ఉంది మరియు ఇంకా చేసుకోగలరు కూడా. శ్రేష్ఠకార్యం కొరకు సమయం లభించకపోవటం, శరీరం సహకరించకపోవమనేది ఉండదు. ఉత్సాహ, ఉల్లాసాలనే చక్రాలు వచ్చేస్తాయి వాటితో నడవని శరీరం కూడా నడవటం మొదలుపెడుతుంది. రోగం కూడా సమాప్తి అయిపోతుంది.

లౌకికంలో ఏదైనా అత్యవసర పని చేయవలసి వస్తే ఏం చేస్తారు? ఆ సమయంలో రోగం పారిపోతుంది కదా! ఆ తర్వాత నిద్రపోయినా కానీ ఆ సమయంలో కష్టంగానైనా చేస్తారు కదా! హద్దులోని కార్యంలోనే ఇలా నడుస్తున్నప్పుడు ఇక్కడ సంతోషంతో నడిచేస్తారు. కష్టమనే చక్రాలు నడిపిస్తున్నప్పుడు సంతోషమనే చక్రాలు నడిపించలేవా? కనుక ఉత్సాహ, ఉల్లాసాలు, సంతోషమనే చక్రాలతో హద్దులోని బంధనను త్రెంచండి. పతి యొక్క బంధన, పిల్లల బంధన సమాప్తి అయిపోయాయి ఇప్పుడు ఈ సూక్ష్మ బంధనాల నుండి కూడా ముక్తులవ్వండి. ఎగరండి మరియు ఎగిరింప చేయండి. ఇది ఇలా, అది అలా... ఇవి కూడా త్రాళ్ళు. వీటిని కూడా త్రెంచుకోండి. ఇవి కూడా క్రిందికి తీసుకువచ్చేస్తాయి. బంధన్ముక్తులై ఎగిరేపక్షి అవ్వండి.

మీ వారసులపై దయ చూపండి. మీ వారసులు ఎంత దు:ఖిగా ఉన్నారు! వారిని మేల్కొల్పటమే మాతల పని. మీరు మేల్కొన్నది ఇతరులను మేల్కొల్పేటందుకు. కనుక ఇప్పటి నుండి దయాహృదయులై మేల్కొల్పకపోతే, మమ్మల్ని ఎందుకు మేల్కొల్పలేదు అని మీ వారసులు మిమ్మల్ని నిందిస్తారు.

బాప్‌దాదా మాతల నుండి ఏమి కోరుకుంటున్నారు? ఒకొక్క మాత జగన్మాతగా అయ్యి విశ్వకళ్యాణం చేయండి. కానీ మాతలు చతురంగా పని చేస్తున్నారు. లౌకిక కార్యం ఉన్నప్పుడు పిల్లలకు ఎవరొకరిని తోడు పెట్టి వెళ్తున్నారు, ఈశ్వరీయ కార్యం ఉన్నప్పుడు మాత్రం పిల్లలను ఎవరు చూస్తారు? అని అంటున్నారు. పాండవులు రచయితలు కనుక వారు సంభాళించాలి, పాండవులు శక్తులను బంధన్ముక్తులు చేయాలి. డ్రామానుసారం వర్తమాన సమయంలో మాతలకు అవకాశం లభించింది. అందువలన మాతలను ముందుంచాలి. ఇప్పుడు చాలా సేవ చేయాలి. విశ్వమంతటినీ పరివర్తన చేయాలంటే సేవ ఎలా పూర్తవుతుంది! తీవ్రవేగం ఉండాలి కదా! కనుక పాండవులు (అన్నయ్యలు) శక్తులను (అక్కయ్యలను) ఫ్రీ చేయండి అప్పుడు సేవాకేంద్రాలు తెరవబడతాయి, ధ్వని బాగా వ్యాపిస్తుంది.

మాతలు ఏ గుణంలో విశేష అనుభవీలు? ఆ విశేషగుణం ఏమిటి? (త్యాగము, సహనశీలత) ఇంకా ఏమైనా గుణాలు ఉన్నాయా? మాతలు విశేషంగా దయాహృదయ స్వరూపంగా ఉంటారు. మీరు బేహద్ మాతలు మరి బేహద్ ఆత్మలపై దయ వస్తుందా? దయ వస్తే ఏం చేస్తారు? దయాహృదయులు సేవ చేయకుండా ఉండలేరు. మీరు దయాహృదయులైతే అనేకాత్మల కళ్యాణం జరుగుతుంది అందువలనే మాతలను కళ్యాణి అని కూడా అంటారు. కళ్యాణి అంటే కళ్యాణం చేసేవారు. ఎలా అయితే బాబాని విశ్వకళ్యాణకారి అని అంటారో అలాగే మాతలకు విశేషంగా బాబా సమానంగా కళ్యాణి అనే బిరుదు లభించింది. స్వపరివర్తన ద్వారా ఇతరులలో కూడా ఉత్సాహ, ఉల్లాసాలు వస్తాయి.

హద్దు మరియు బేహద్‌సేవ రెండింటి సమానత ఉందా? హద్దులోనిసేవ ద్వారా ఖాతా సమాప్తమవుతూ ఉంటుంది మీరు బేహద్ సేవాధారులు సేవ యొక్క ఉత్సాహ, ఉల్లాసాలు మీలో ఎంత ఉంటాయో అంత సఫలత లభిస్తుంది. మాతలు మీ యొక్క త్యాగం మరియు తపస్సు ద్వారా విశ్వకళ్యాణం చేయటానికి నిమిత్తమై ఉన్నారు. మాతలలో త్యాగం, తపస్య యొక్క విశేషత ఉంది. ఈ రెండు విశేషతల ద్వారా సేవకు నిమిత్తమే. ఇతరులను కూడా బాబా వారిగా చేయటంలో నిమగ్నమై ఉన్నారా? సంగమయుగీ బ్రాహ్మణుల పనే సేవ చేయటం. నామధారి బ్రాహ్మణులు కూడా కథలు చెప్తూ ఉంటారు కదా! ఇక్కడ కూడా కథ చెప్పటం అంటే సేవ చేయటం. జగన్మాత అయ్యి జగత్తుకోసం ఆలోచించండి, బేహద్ పిల్లల కోసం ఆలోచించండి, కేవలం ఇంట్లో కూర్చుండిపోకండి. బేహద్ సేవాధారి అయ్యి సదా ముందుకి వెళ్తూ ఉండండి. **63** జన్మలు హద్దులో ఉన్నారు ఇప్పుడు బేహద్‌సేవలో ముందుకు వెళ్ళండి.

కేవలం లౌకిక పరివారం యొక్క బాధ్యత నిలుపుకునేవారిగా కాదు, విశ్వంలో సర్వాత్మల సేవా బాధ్యతను నిలుపుకునేవారు. నిమిత్తంగా ఎక్కడ ఉంటున్నా కానీ స్మృతిలో విశ్వసేవ ఉండాలి. ఎటువంటి లక్ష్యమో అటువంటి లక్షణాలు స్వతహాగానే వస్తాయి. బేహద్ లక్ష్యం ఉంచుకుంటే బేహద్ లక్షణాలు వస్తాయి లేకపోతే హద్దులోనే చిక్కుకుని ఉండిపోతారు. సదా బేహద్ తండ్రి యొక్క సంతానాన్ని అనే స్మృతిలో సర్వాత్మలకు శుభసంకల్పంతో సేవ చేస్తూ ఉండండి. నోటి ద్వారా మరియు సంకల్పం ద్వారా రెండింటి ద్వారా వెనువెంట సేవ చేయండి. నోటి ద్వారా ఎవరికైనా అర్థం చేయించినా కానీ శుభభావన యొక్క బలం ఆ ఆత్మకు ఇవ్వకపోతే ఫలం రాదు.కనుక మనసా, వాచా రెండు వెనువెంట సేవ చేయండి. కేవలం సందేశం ఇచ్చే వరకు కాదు లేకపోతే కేవలం అలాగే, అలాగే అంటూ వెళ్ళిపోతారు. మనసాసేవ వెనువెంట చేస్తే బాణం తగులుతుంది.

మాతలు సేవామైదానంలోకి రావాలి. ఒక్కొక్క మాత ఒక్కొక్క సేవాకేంద్రాన్ని సంభాళించాలి. ఖాళీ లేకపోతే ఇద్దరు, ముగ్గురు కలిపి గ్రూప్‌గా తయారవ్వండి. ఇంటి బంధన, పిల్లలున్నారు అని అనకండి. సంఘసేవ చేసే మాతలకు కూడా పిల్లలు ఉంటారు అయినా కానీ వారు సేవ చేస్తారు కదా! అలాగే మీరు మీకు సహయోగులను తయారుచేసుకోండి, సేవను పెంచండి. ఎవరో ఒకరిని తయారుచేసి ఆ స్థానంలో నిమిత్తం చేసి ముందుకు వెళ్ళిపోండి. శక్తులూ! ఇప్పుడు మైదానంలోకి రండి. బాబా నుండి మీరు తీసుకున్న పాలనకు బదులు ఇవ్వండి. ఎంత సేవను పెంచుతూ ఉంటారో అంతగా స్వయానికి కూడా ఫలం లభిస్తూ ఉంటుంది. వర్తమానం కూడా శక్తిశాలిగా ఉంటుంది మరియు భవిష్యత్తు కూడా తయారవుతుంది. ఎంత సేవ చేస్తారో అంత నిర్విఘ్నంగా ఉంటారు మరియు సంతోషం కూడా ఉంటుంది.

అందరు మీ యొక్క కల్పపూర్వపు చిత్రాన్ని చూసుకుంటూ ఉన్నారా? అది ఏ చిత్రం? ఆ చిత్రంలో బాబా తోడు ఉంటారు మరియు సేవ కూడా ఉంటుంది. అది ఏమిటంటే గోవర్ధన పర్వతాన్ని ఎత్తుతున్న చిత్రం. ఈ చిత్రంలో బాబాతో పాటు పిల్లలు కూడా ఉంటారు. మరియు ఇద్దరు సేవ చేస్తున్నారు. పర్వతానికి వ్రేలు ఇవ్వటం సేవే కదా! ఈ చిత్రం మాదే అని సంతోషంతో అనండి. మీరు సహయోగి అయినదానికి స్మృతిచిహ్నమే ఇది. వ్రేలు అనేది సహయోగానికి గుర్తు.మీరందరు బాప్‌దాదాకి సహయోగులు కదా! మొదట్లో తెలియని కారణంగా తనువు, మనస్సు, ధనాలను భక్తిలో ఉపయోగించేవారు ఇప్పుడు మిగిలినదంతా సత్యమైన సేవలో బాబాకి సహయోగి అయ్యి ఉపయోగిస్తున్నారు. **99** శాతం పోగొట్టుకున్నారు ఒక శాతం మాత్రమే మిగిలి ఉంది. అది కూడా సహయోగంలో వినియోగించకపోతే ఎక్కడ వినియోగిస్తారు? ఎక్కడ సత్యయుగీ రాజు కానీ

ఈరోజు ఎలా ఉన్నారు? తనువులో కూడా శక్తి ఎక్కడ ఉంది? ఈరోజుల్లో యువకులు కూడా వృద్ధులు. వృద్ధులు చేయగలిగినంత పని ఈనాటి యువకులు చేయలేకపోతున్నారు, పేరుకే యువకులు. అలాగే ధనాన్ని కూడా పోగొట్టుకున్నారు. దేవతల నుండి వ్యాపారం చేసే వైశ్యులుగా అయిపోయారు. అలాగే మనస్సు యొక్క శాంతి కూడా ఎక్కడ ఉంది? భ్రమిస్తున్నారు. ఇలా మనస్సు యొక్క శాంతి, తనువు, ధనం అన్నీ పోగొట్టుకున్నారు ఇంకేమి మిగిలింది? మిగిలిన ఒక్క శాతాన్ని ఈశ్వరీయసేవలో ఉపయోగించి తిరిగి కోటానుకోట్లు జమ చేసుకుంటున్నారు. మిగిలిన ఒక్క శాతం యొక్క తనువు, మనస్సు, ధనాలను ఈశ్వరీయ కార్యంలో ఉపయోగించటం ద్వారా **21** జన్మలు **2500** సంవత్సరాలకు జమ అయిపోతుంది. ఇటువంటి సహయోగి పిల్లలకు బాబా కూడా సదా స్నేహాన్ని, సహయోగాన్ని ఇస్తారు. ఆ సహయోగం యొక్క చిత్రాన్నే ఇప్పుడు చూస్తున్నారు. ప్రత్యక్షంగా చేస్తున్నారు మరియు చిత్రాన్ని కూడా చూస్తున్నారు. మామూలుగా అయితే ఎవరైనా చనిపోయిన తర్వాత తమ చిత్రాన్ని చూసుకోరు కానీ మీరు చైతన్యంగా కల్పపూర్వపు చిత్రాన్ని చూస్తున్నారు. మొదట్లో మీ చిత్రానికే పూజించేవారు సదా ప్రతి కార్యంలో సహయోగమిచ్చే శుభసంకల్పం చేయాలి.

మాతలు ఏమి అద్భుతం చేస్తారు? మాతలైన మీ కొరకు ఒక గీతం తయారుచేయబడింది. ఆ గీతం గుర్తు ఉందా? ఆ గీతం ఏమి చెప్తుంది? శివశక్తులే వెలసెను.... ఈ పాట విన్నారా? వినకపోతే రేపు వినండి. మాతల పని ఏమిటి? పిల్లలను లేపటం, పాలన చేయటం మరియు అధికారిగా తయారుచేయటం. విశ్వమంతటిలో బాబా పిల్లలు చాలామంది ఉన్నారు, మీ సోదరీ సోదరులు చాలామంది నిద్రపోతున్నారు, వారిని మేల్కోల్పండి. మేలుకో, మేలుకో... అంటూ చాలా మంచి పాటలు పాడతారు కానీ ఇప్పుడు నిద్రపోతున్న ఆత్మలను మేల్కొల్పండి. కనీసం దోసిలితోనైనా వారసత్వం తీసుకోనివ్వండి. ఇప్పటికీ ఇంకా బాగా ఆలశ్యం అనే బోర్డు పెట్టలేదు కదా! ఆలశ్యమైంది కానీ బాగా ఆలశ్యమవ్వలేదు; బాగా ఆలశ్యం అయ్యే ముందుగా వారిని మేల్కోల్పండి. మేల్కొల్పుతారు కదా! మీ మీ స్థానాలలో సేవ చేసి వారిని మేల్కొల్పండి,ఎంతగా మేల్కొల్పాలంటే దీపపు పురుగై దీపం వరకు వచ్చేయాలి. సరేనా మాతలు! ఒకొక్క మాత నెలకు ఒకొక్కరిని చొప్పున తయారు చేయండి. చేయగలరా? రోజుకొకరు కాదు, నెలకి ఒకరు. నెలకి ఒకరు చేయలేకపోతే కనీసం రెండు నెలలకు ఒకరిని అయినా తయారుచేయండి. ధైర్యం ఉందా?

చెడు సాంగత్యం కారణంగా చిక్కుకుపోయిన దు:ఖి ఆత్మలు చాలామంది ఉన్నారు. అటువంటి సంస్థలకు కూడా నియమపూర్వకంగా పద్ధతి ప్రకారంగా వెళ్ళి సేవ చేయండి. ఏదో మామూలుగా వెళ్ళిపోయి వారి నుండి అవమానం పొంది రాకూడదు, పద్ధతి ప్రకారంగా వెళ్ళాలి. పాడైపోయిన వారిని ఉద్ధరించండి, మాతలు చేయగలరా?

ప్రవృత్తిలో ఉన్నది కూడా విశ్వం ముందు సేవకి ఒక ఉదాహరణగా అవ్వడానికే. ప్రవృత్తిలో ఉంటూ విశ్వమనే షోకేస్‌లో విశేషమైన షో పీస్ అయ్యి నడుస్తున్నారా? ఒక బొమ్మ అనేకమందిచే వ్యాపారం చేయించడానికి నిమిత్తమవుతుంది. ప్రవృత్తిలో ఉంటూ మిమ్మల్ని మీరు ఈవిధంగా భావించి నడవండి. ఇంట్లో ఉండటం లేదు షోకేస్‌లో ఉంటున్నారు. ఇలా మీరు కొంచెం ముందుకి వెళ్తే బాబా పేరు ప్రసిద్ధి అవుతుంది. మిమ్మల్ని దర్శనం చేసుకోవడానికి తపిస్తూ వస్తారు. మేము చేయలేనిది చేసి చూపించిన బలశాలి ఆత్మలు ఎవరు అని చూడడానికి వస్తారు. దంపతులకు అపరంఅపారమైన మహిమ జరుగుతుంది. మీరు ఏమీ సాధారణమైనవారు కాదు, విశేషాత్మలు.

ప్రవృత్తిలో ఉండేవారి గురించి బాప్‌దాదాకి ఒక శుభ ఆశ ఉంది, అది ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. ఆ ఆశ ఏమిటి? సేవ కోసం మాతలు చాలామంది కావాలి, సెంటర్లో మాతలు ఉంటే నిమిత్తమైన వారు నిస్సంకల్పంగా ఉంటారు, కానీ ప్రవృత్తిలో ఉండే మాతలు సేవ కోసం రావటం తక్కువ. కుమారీలకు ట్రైనింగ్ ఎలా ఇస్తారో అలా **15** రోజులు మాతలకు ట్రైనింగ్ ఇచ్చి ఒకటి, రెండు, మూడు నెలలు సేవకి పంపి చూడండి. ఏ దేశంలోని మాతలు అయినా కానీ మిమ్మల్ని మీరు ఫ్రీ చేసుకుని రెండు నెలలు, నాలుగు నెలలు, ఆరు నెలలు ఏదో పద్ధతితో సేవ చేయాలి. మాతలు సేవ కోసం ముందుకి వస్తే చాలా సేవ జరుగుతుంది. ఇప్పుడు ఇతరులు ఆహ్వానిస్తున్నా కానీ సేవాకేంద్రాలు తెరవలేకపోతున్నారు, కారణం ఏమిటి? ఇప్పటి సమయానుసారంగా చిన్న చిన్న కుమారీలను ఒంటరిగా ఉంచలేరు. వారికి మాత తోడుగా ఉంటే ఒక నెలలో ఎన్ని సెంటర్స్ తెరవవచ్చో చూడండి. కానీ మాతలలో ఈ ధైర్యం లేదు. కొందరికి మనవడు, కొందరికి మనవరాలు, కొందరికి భర్త... ఇలా ఏవేవో బంధనాలు. మాతలకు ఉత్సాహం ఉరకలెత్తాలి. ప్రవృత్తిని సంభాళించాలి కానీ ఒకరికొకరు సహయోగి అయ్యి, తోడుగా ఉంటూ మొదట రెండు, మూడు నెలలు తీయండి అప్పుడు మీకే సేవారసం అనుభవం అవుతుంది. అప్పుడు స్వతహాగానే మిమ్మల్ని మీరు నిర్భందనులుగా చేసుకుంటారు. ప్రవృత్తిలో ఉండే అన్నయ్యలు మాతలకు ఏదొక రకంగా సహాయకారులై మాతలను సేవ కోసం స్వతంత్రుల్ని చేయండి. ఇప్పటి వరకు కూడా బాప్‌దాదా యొక్క ఈ ఆశను ప్రవృత్తి వారు పూర్తి చేయలేదు.

ప్రతిసారి మాతలే ఎక్కువమంది ఉంటారు. మీరు అందరినీ తీసుకురండి, అప్పుడు హాల్ స్వతహాగానే పెద్దది అవుతుంది. హాల్ అంతా ఇప్పుడే నిండిపోయింది కదా, వారు ఎక్కడ కూర్చుంటారు అని ఆలోచించకండి. తక్కువలో తక్కువ **9** లక్షల ప్రజలను అయినా తయారుచేస్తారా లేదా?

బాబా వ్యక్తిగతంగా నాకు ఏమి చెప్పారు? అని అనుకుంటున్నారు కదా! మీతో మాట్లాడిన వ్యక్తిగత మాటలివే. మీరు ఎగిరేకళ యొక్క సమయం వారు కనుక క్రిందికి రాకూడదు. సదా పైన ఉండండి. పది త్రాళ్ళు త్రెంచుకుని ఒక త్రాడు ఉన్నా కానీ అది తనవైపు లాగుతుంది. అన్ని త్రాళ్ళను త్రెంచుకునేవారు అంటే అన్ని హద్దులకు అతీతంగా ఉండే బేహద్ ఎగిరేపక్షి మీరు కనుక మీరు హద్దులో చిక్కుకోకూడదు. **63** జన్మలు హద్దులో చిక్కుకుంటూ వచ్చారు ఇప్పుడు ఈ ఒక్క జన్మ హద్దు నుండి బయటికి రండి. ఎటువంటి సమయమో అటువంటి పని చేయాలి కదా! లేచే సమయంలో ఎవరైనా నిద్రపోతే అది బావుంటుందా! ఇప్పుడిది బేహద్‌లోకి వచ్చే సమయం.

మాతలు ఒక కొత్త ఉదాహరణ చూపించాలి; ఇంట్లో మీ కుటుంబంలో కొందరికి నలుగురు, కొందరికి ఎనిమిదిమంది, కొందరికి ఇద్దరు పిల్లలు ఉంటారు ఎంతమంది ఉన్నా కానీ కుటుంబంలో ఉండే మీరు మీ పిల్లలకు ఈ విలువలను నేర్పించి తయారు చేయాలి. అటువంటి పిల్లలను గ్రూపుగా తయారుచేసి స్కూళ్ళు, కాలేజీలలో చదువుకునే పిల్లలకు చూపించాలి, వారిని వారు ఒక ఉదాహరణగా తీస్కోవాలి. మీ పిల్లల గురించి వారి స్కూల్ లేదా కాలేజి టీచర్స్‌ని అడిగినా కానీ, వారి వీధిలోని స్నేహితులను అడిగినా కానీ అందరూ మంచిగా చెప్పాలి. అంతేకాని మీరేమో మంచివారు అని, టీచర్స్‌ని అడిగితే వారు చదవరు అని చెప్పకూడదు. పిల్లలు జ్ఞానంలోకి రావటం మంచిదే కానీ కొద్దిగా వారిపై ధ్యాస పెట్టి విలువలు కలిగినవారిగా తయారుచేసి గ్రూపుగా చేయాలి.

ప్రతి సేవాకేంద్రంలో ప్రతి వర్గానికి చెందిన వారు ఒకరు ఉండాలి. **13** రకాల వర్గాలు తయారయ్యాయి కదా, వారందరు రావాలి, ఏ వర్గం వారు మిగిలిపోకూడదు. పెద్ద జమీందారు రావాలి, విజ్ఞానం వారు రావాలి... ఇలా ప్రతి వర్గం వారు రావాలి. ఇలా రకరకాల వర్గాల వారి యొక్క మాల ప్రవృత్తి వారు తయారుచేయాలి. తక్కువలో తక్కువ ప్రతి వర్గం నుండి ఒకరైనా ఉండాలి. మీరు మహిళలు కనుక మహిళలను అయినా తీసుకురావచ్చు. మహిళలలో కూడా కొందరు లాయర్లు ఉంటారు, కొందరు డాక్టర్లు ఉంటారు ఇలా రకరకాల వర్గాల వారిని తీసుకురావాలి.

మాతలు వస్త్రంతో తయారైన బాబా జెండాను ఎగురవేయటం కాదు, ప్రతి ఒక్కరి హృదయంలో బాబా ప్రత్యక్షత అనే జెండాను ఎగరవేయండి. జెండా ఎగరవేయటం వచ్చా? తెలివైనవారు మాతలు. మీ పిల్లలు కుంభకర్ణుల్లా నిద్రపోతున్నారు, మేల్కొల్పండి. మేల్కొని తండ్రి వచ్చేశారు అనే మాట వారి నోటి నుండి రావాలి. మాతలు ఇలా అద్భుతం చేయాలి. మాతలకు

విశేషత ఉంది. మీరు గ్రామాలలోని మాతలు అయినా సరే ఏ సేవాకేంద్రంలో మాతల సంఖ్య ఎక్కువ  ఉంటుందో అక్కడ భండారా మరియు భండారీ నిండుగా ఉంటుంది. అన్నయ్య ఒకరు ఉండి మాతలు 25 మంది ఉన్నా కానీ మాతల హృదయం విశాలంగా ఉంటుంది. శక్తులందరి చేతిలో బాబా ప్రత్యక్షత యొక్క జెండా ఉంది కదా! ఇప్పుడు ప్రతి ఒక్క శక్తి ద్వారా బాబా ప్రత్యక్షత యొక్క జెండా ఎగరాలి. అప్పుడే జై జై కారాలు వస్తాయి. శక్తుల ద్వారా బాబా ప్రత్యక్షమయ్యారు కనుకనే శివశక్తి ఇద్దరిని కలిపి చూపించారు. శివునికి పూజ చేసేవారు శక్తిని కూడా తప్పక పూజిస్తారు. తండ్రి మరియు శక్తులకు లోతైన సంబంధం ఉంది. అందువలనే పూజ ఇద్దరికీ వెనువెంట జరుగుతుంది. శక్తుల ప్రత్యక్షతా జెండా ఎగరవేశారు కనుకనే పూజ జరుగుతుంది. జెండా ఎగరవేయటం అంటే ధ్వనిని పెద్దగా వ్యాపింపచేయటం.

అందరు పుణ్యాత్మలే కదా! అన్నింటికంటే గొప్పపుణ్యం ఇతరులకు శక్తినివ్వటం. సదా సర్వాత్మలకు పుణ్యాత్మగా అవ్వండి అంటే మహాదానియై మీకు లభించిన ఖజానాను అందరికీ ఇవ్వండి. ఇతరులకు ఇవ్వటం ద్వారా మీకు కోటానుకోట్లు పెరుగుతుంది. ఎంత తనువు, మనస్సు, ధనాలను సేవలో ఉపయోగిస్తారో అంతగా వర్తమానంలో కూడా పుణాత్మగా అవుతారు మరియు భవిష్యత్తుకి కూడా సదాకాలికంగా జమ అవుతుంది.అన్నింటినీ జమ చేసుకునే భాగ్యం డ్రామానుసారం లభించింది. ఆలోచించి చేసారంటే వెండి అవకాశం, విశాలహృదయులై చేసారంటే బంగారు  అవకాశం.

సదా స్వ ఉన్నతి మరియు సేవా ఉన్నతిలో బిజీగా ఉండండి. మరియు సర్వుల పట్ల శుభభావన పెట్టుకోండి. శుభభావనతో ఏ సంకల్పం చేస్తారో అది పూర్తయిపోతుంది. శుభసంకల్పం పూర్తి అవ్వడానికి సాధనం ఏకీరసస్థితి. శుభచింతన, శుభచింతకులు వీటి ద్వారా అన్ని విషయాలలో సంపన్నం అయిపోతారు. నలువైపుల వాతావరణాన్ని శక్తిశాలిగా చేయటమే శక్తిశాలి శ్రేష్టాత్మల యొక్క కర్తవ్యం. వాతావరణం శక్తిశాలి చేయటంలో కూడా సదా సహయోగి. వాతావరణాన్ని అలజడి చేయకూడదు.సహయోగి అవ్వటానికి బదులు అలజడి చేసేవారిగా కాకూడదు. సదా సహయోగి అనగా సదా సంతుష్టం. ఒక బాబా తప్ప మరెవ్వరు లేరు ఏ సంకల్పం వచ్చినా నిమిత్తమైన వారికి చెప్పి నిస్సంకల్పం అయ్యి నడవాలి. మీ అభిప్రాయం చెప్పటం, సైగ చేయటం వేరే విషయం, అలజడిలోకి రావటం వేరే విషయం. సదా ఏకీరసంగా ఉండాలి. సంకల్పం చెప్పారు, తిరిగి నిస్సంకల్పం అయిపోవాలి.

# నష్టోమోహ అవ్వండి !

మాతలు నిర్మోహియేనా? నష్టోమోహ కదా! మాతలకు విశేష విఘ్నం మోహమే. నష్టోమోహ అంటే తీవ్రపురుషార్థి. కొంచెం అయినా దేహసంబంధాలపై మోహం ఉంటే తీవ్రపురుషార్థికి బదులు పురుషార్థిలోకి వచ్చేస్తారు. తీవ్రపురుషార్థి అనగా మొదటి నెంబర్. పురుషార్థి అనగా రెండవ నెంబర్. ఏమైనా కానీ, ఏదైనా కానీ సంతోషంలో నాట్యం చేస్తూ ఉండండి. నష్టోమోహగా అయినవారే విజయీమాలలో పూసగా అవుతారు. మోహంపై విజయం పొందారంటే మీరు సదా విజయీ.

లౌకిక సంబంధాలు కూడా సేవార్థం లభించాయి. ఈమె నా కూతురు, ఇతను నా కొడుకు అని అనుకోకూడదు. సేవ  నిమిత్తంగా ఈ సంబంధాలు లభించాయి. నాది అనేది ఉంటే స్మృతి విస్మృతి అయిపోతుంది. నాది అనేది సమాప్తి అయిపోతే నష్టోమోహ అయిపోతారు. నష్టోమోహ అనగా స్మృతి స్వరూపం. మాతలు నష్టోమోహగా అయిపోతే నెంబరు ముందుకి వెళ్ళిపోతుంది.

మాతలు మాయాజీత్‌లే కదా? కొద్ది,కొద్దిగా మోహం ఉందా? పిల్లలపై లేకపోతే మనవలపై ఉంటుంది. పిల్లల సేవ పూర్తయ్యిందంటే ఇతరుల సేవ మొదలవుతుంది. తక్కువ అవ్వదు. ఒకటి తర్వాత ఒకటి వరస పెట్టేస్తాయి మరి వీటి నుండి బంధన్ముక్తులేనా?

రెండు మాటలు గుర్తు పెట్టుకోండి -**1.** నష్టోమోహ, బేహద్ సంబంధం యొక్క స్మృతిస్వరూపం. **2.** నేను బాబా వారిని, బాబా నా తోడు. బాబాతో సర్వసంబంధాలు జోడించాలి. ఇవి గుర్తు పెట్టుకోగలరు కదా!

మాతలు అందరు నష్టోమోహ కదా! బాబాతో సర్వ సంబంధాలు జోడించినప్పుడు ఇక ఎవరిపైనైనా మోహం ఉంటుందా? సంబంధం లేకుండా ఎవరితోను మోహం ఉండదు. అంటే మోహానికి బీజం సంబంధం. బీజమే లేకపోతే వృక్షం ఎక్కడి నుండి వస్తుంది? ఒకవేళ ఇప్పటికీ ఇంకా మోహం ఉంది అంటే సంబంధం రెండువైపుల ఉంది అని అర్థం. బాబావైపు ఉంది, వారివైపు ఉంది. రెండు వైపుల ఉన్నవారికి గమ్యం లభించదు, తీరం దొరకదు. నష్టోమోహ అయితే బంధన ఏమి చేయము, తెగటం లేదు అనే ఫిర్యాదులు ఉండవు. మోహం పోయినప్పుడు స్వతహాగానే స్మృతి స్వరూపం అయిపోతారు. అప్పుడు తెగటం లేదు, తొలగటం లేదు అనే భాష ఉండదు, సర్వ ప్రాప్తి స్వరూపంగా అయిపోతారు.

బాబా తోడుగా ఉంటే సర్వశక్తులు మీ తోడుగా ఉంటాయి. బాబా తోడు మిమ్మల్ని శక్తిశాలిగా తయారుచేస్తుంది. బాబాని తోడుగా పెట్టుకునేవారు నిర్మోహిగా ఉంటారు వారిని ఏ మోహం సతాయించదు. మరైతే మీరు నష్టోమోహాయేనా? ఎటువంటి పరిస్థితి వచ్చినా కానీ ప్రతి పరిస్థితిలో నష్టోమోహా. ఎంత నష్టోమోహాగా ఉంటారో అంత స్మృతి మరియు సేవలో ముందుకు వెళ్తూ ఉంటారు. నిమిత్తమాత్రంగా లౌకికస్థూల కార్యం చేస్తున్నా కానీ స్థూలం, సూక్ష్మం రెండూ వెనువెంట చేయండి. చేతులతో స్థూలకర్మ చేయండి, బుద్ధితో మనసాసేవ చేయండి. చేతులతో కర్మ చేస్తూ కూడా స్మృతిశక్తి ద్వారా ఒకే స్థానంలో ఉంటూ చాలా సేవ చేయచ్చు.

## చింతాముక్తులు కండి !

మాతలకు పిల్లల గురించి చింత ఉందా? ప్రపంచంలో ఏది జరిగినా కానీ అశాంతి వాయుమండలంలో శాంతి స్వరూప ఆత్మలైన మీరు ఇతరులకి శాంతినిచ్చేవారు. లేదా అశాంతిని చూసి మీరు భయపడతారా? మీ ఇంటి బయట చాలా గొడవ జరుగుతుంది అనుకోండి అప్పుడేమి చేస్తారు? బాబా స్మృతిలో కూర్చుంటారు కదా! బాబాని స్మృతి చేసి శాంతిని తీసుకుని ఇతరులకి ఇవ్వాలి. ఈ సేవ చేయండి. ఎందుకంటే మీ దగ్గరున్న మంచి వస్తువు ఇతరులకు అవసరమైతే ఇవ్వాలి కదా! కనుక అశాంతి సమయంలో మాస్టర్ శాంతిదాతలై ఇతరులకు శాంతినివ్వండి. భయపడకండి.ఎందుకంటే ఏది జరుగుతుందో అది కూడా మంచిది, ఏది జరగబోతుందో అది ఇంకా మంచిది అని మీకు తెలుసు. వికారాలకు వశీభూతమైన మనుష్యులు కొట్టుకుంటూనే ఉంటారు వారి పనే అది. అటువంటి ఆత్మలకు శాంతినివ్వటం మీ పని. ఎందుకంటే మీరు విశ్వకళ్యాణకారి కదా! విశ్వకళ్యాణకారి ఆత్మలు సదా మాస్టర్ దాత అయ్యి ఇస్తూ ఉంటారు. అందరు శక్తిరూపాలు కదా! మాతలు నాలుగు గోడల మధ్య ఉండే అబలలు కాదు, శక్తులు. శక్తులు సదా వరదానిగా ఉంటారు.

మీరు నిశ్చింతాచక్రవర్తులేనా? పిల్లలను ఏం చేయలి? మనవలను ఏం చేయాలి? అని మాతలకు చింత ఉందా? తండ్రి ఉన్నప్పుడు పిల్లలకు చింత ఏమిటి? ఏ విషయం గురించి చింతించినా చింతించటం వలన సఫలత లభించదు. చింతించేవారు స్వయాన్ని పోగొట్టుకుంటారు, సమయాన్ని పోగొట్టుకుంటారు. ఎందుకంటే శక్తి వ్యర్థం అవుతుంది. ఏ పని గురించి అయినా చింత ఉంటే ఆ పని పాడైపోతుంది. సఫలత కావాలంటే దానికి విధి ఏమిటంటే – నిశ్చింతగా అవ్వటం. చింత ఏదీ లేదు కదా? తనువు యొక్క చింత ఉండకూడదు, మనస్సులో వ్యర్థం యొక్క చింత ఉండకూడదు, ధనం గురించి చింత ఉండకూడదు. పప్పు, రొట్టె తినటం, బాబా గుణాలు

పాడుకోవటం. ధనం యొక్క చింత, మనస్సు అలజడి యొక్క చింత, తనువు యొక్క కర్మభోగం యొక్క చింత ఏదీ ఉండకూడదు.ఇది అంతిమజన్మ, అంతిమ సమయం కనుక అన్నీ పూర్తి అవ్వాల్సిందే అని మీకు తెలుసు అందువలన సదా శుభచింతకులుగా ఉండాలి. ఏం జరుగుతుందో అని ఏ చింత ఉండకూడదు. జ్ఞానశక్తితో మీకు అన్నీ తెలుసు. అన్నీ తెలిసినప్పుడు ఏం జరుగుతుందో అనే ప్రశ్న సమాప్తం. ఏది జరుగుతుందో అది మంచే జరుగుతుంది అనే జ్ఞానం మీకు ఉంది కనుక సదా చింతలన్నింటి నుండి అతీతంగా, నిశ్చయబుద్ధిగా, నిశ్చింతగా సదా శుభచింతకులుగా ఉండాలి, ఇదే జీవితం. జీవితంలో నిశ్చింత లేకపోతే అది జీవితం ఏమిటి! ఇటువంటి శ్రేష్ట జీవితాన్ని అనుభవం చేసుకుంటున్నారా? కుటుంబం గురించి కూడా చింత లేదు కదా? ప్రతి ఆత్మ తన కర్మలఖాతాను తయారుచేసుకుంటుంది మరియు పూర్తి చేసుకుంటుంది ఇందులో మనం చింతించేదేముంది? మొదట్లో ఈ చింత అనే చితిపై కాలిపోయేవారు ఇప్పుడు బాబా వచ్చి అమృతం వేసి కాలే చితి నుండి మిమ్మల్ని బ్రతికించారు. భగవంతుడు చనిపోయిన వారిని బ్రతికిస్తాడు అంటారు కానీ ఎలా బ్రతికిస్తాడో తెలియదు, అది ఇదే.

ప్రవృత్తిలో ఉంటూ అతీతంగా మరియు అతి ప్రియంగా ఉంటున్నారా? ప్రవృత్తితోనే తగుల్కొని ఉండిపోవటం లేదు కదా! ఎక్కడైనా ఎవరితోనైనా తగుల్పాటు ఉంటే అది సదాకాలికంగా జీవితానికి విఘ్నం అయిపోతుంది. అందువలన సదా నిర్విఘ్నులై ముందుకి వెళ్తూ ఉండండి. కల్పపూర్వపు స్మృతిచిహ్నం అయిన అంగదుని సమానంగా అచంచలంగా, స్థిరంగా ఉండండి. అంగదునికి ఏ విశేషత చూపించారు? పాదం కూడా కదపలేనంత నిశ్చయబుద్ధి. నిశ్చయం అనే పాదాన్ని కదపడానికి మాయ భిన్న భిన్న రూపాలలో వస్తుంది కానీ మాయ కదిలిపోవాలే కానీ మీ నిశ్చయం అనే పాదం కదలకూడదు. అప్పుడు మాయ స్వయమే అర్పణ అయిపోతుంది. మీరు అర్పణ అవ్వరు కదా. బాబాకి అర్పణ అవ్వాలి కానీ మాయకి కాదు. ఇటువంటి నిశ్చయబుద్ధి ఆత్మలు సదా నిశ్చింతగా ఉంటారు. కొంచెమైనా చింత ఉంది అంటే నిశ్చయం లోపం. ఎప్పుడైనా ఏ విషయంలోనైనా చింత ఉంది అంటే దానికి కారణం ఏదొక విషయంలో నిశ్చయం తక్కువగా ఉంది. డ్రామాపై నిశ్చయంలోనో, స్వయంపై నిశ్చయంలోనో, బాబాపై నిశ్చయంలోనో లోపం ఉంది. మూడు రకాల నిశ్చయాలలో ఏది తక్కువ ఉన్నా కానీ నిశ్చింతగా ఉండలేరు. అన్నింటికంటే పెద్ద రోగం - చింత. చింత అనే రోగానికి వైద్యుల దగ్గర మందు లేదు. కొంచెం సమయం కొద్దిగా నయమవ్వడానికి మందులు ఇస్తారు కానీ సదాకాలికంగా చింతను పోగొట్టలేరు. చింత గలవారు ప్రాప్తి కోసం ఎంత పరుగుపెడుతూ ఉంటారో అంతగా ఆ ప్రాప్తి ముందుకి పరుగుపెడుతూ ఉంటుంది. అందువలన సదా నిశ్చయం అనే పాదంతో అచంచలంగా ఉండండి. సదా ఒకే బలం, ఒకే నమ్మకం ఇదే పాదం. ఇటువంటి నిశ్చయబుద్ధి పిల్లలకు విజయం నిశ్చితం. మిమ్మల్ని

మీరు పదమాపద భాగ్యశాలిగా అనుభవం చేసుకుంటున్నారా? ఎందుకంటే దాత అయిన బాబా ఎంతగా ఇచ్చారంటే ఒక జన్మకే కాదు అనేక జన్మలకు అవినాశి భాగ్యం వస్తుంది. ఎప్పుడూ ఏ విషయం గురించి చింతించకూడదు. ఆస్తి ఏమవుతుంది, పరివారం ఏమవుతారో? ఇలా ఏ చింత ఉండకూడదు. పాత ప్రపంచంలో ఏమి జరుగుతుంది? పరివర్తనే జరుగుతుంది కదా! ఈరోజు ఉంది, రేపు ఉంటుందో లేదో ఈ చింత కూడా ఉండకూడదు. ఏది జరుగుతుందో అది మంచిగా జరుగుతుంది. ఏదీ చెడు కాదు. ప్రవృత్తిని సంభాళిస్తూ సేవా బాధ్యతను సంభాళించేవారికి డబల్ లాభం ఉంటుంది. దారిలో నడుస్తుండగా భగవంతుని ద్వారా చక్రవర్తిత్వం లభించినట్లు అయ్యింది. డబల్ బాధ్యత అంటే డబల్ ప్రాప్తి కానీ డబల్ లైట్‌గా ఉండాలి. డబల్‌లైట్‌గా భావించటం ద్వారా లౌకిక బాధ్యతలలో కూడా అలసట రాదు. నిమిత్తులకు అలసట ఎలా ఉంటుంది! మీ గృహస్థంగా భావించినప్పుడే భారం అనిపిస్తుంది. మీది కానప్పుడు ఏ విషయం గురించి మీకు భారం? తండ్రి శ్రేష్ఠం, ప్రాప్తి శ్రేష్ఠం, స్వయం కూడా శ్రేష్ఠమైనవారు. ఎక్కడ శ్రేష్ఠత ఉంటుందో అక్కడ ప్రాప్తి ఉంటుంది. సాధారణత ఉంటే ప్రాప్తి కూడా సాధారణంగానే ఉంటుంది.

## దు:ఖానికి వీడ్కోలు !

సదా సంతోషంలో ఉంటున్నారు కదా? ఎప్పుడూ ఏడవటం లేదు కదా? **1.** కళ్ళు యొక్క కన్నీళ్ళు **2.** మనస్సు యొక్క కన్నీళ్ళు; మనస్సు యొక్క కన్నీరు కూడా రాకూడదు. మనస్సులో దు:ఖం రావటమే మనస్సు యొక్క కన్నీరు. రెండు రకాలుగా కూడా కన్నీరు రాకూడదు. ఏడుపు నుండి మీరు ముక్తులు కదా! ఏడ్చేవారు పోగొట్టుకుంటారు నవ్వేవారు పొందుతారు. ఎప్పుడూ కూడా, పొరపాటున కూడా దు:ఖమయ ప్రపంచాన్ని చూడకూడదు. మాతలు పదమాపద భాగ్యశాలులు. బాబా అయితే ఇదే శ్రేష్ఠదృష్టితో చూస్తారు. సౌభాగ్యశాలి కాదు, పదమాపద భాగ్యశాలి. సౌభాగ్యశాలి అవ్వటం సాధారణ విషయం సదా బాబా ఖజానాను స్మరిస్తూ హర్షితంగా ఉండండి. మొత్తం కల్పంలో ఇంత ఖజానా ఏ జన్మలోని లభించదు కనుక ఎంత సంతోషంలో ఎగురుతూ ఉండాలి! ఫరిస్తాలు క్రిందికి రావు. పైన ఎగురుతూ ఉంటాయి. సదా ఒకే సంలగ్నతలో ఉండేవారే కదా! కేవలం ఒక బాబా తప్ప ఏ సంలగ్నత ఉండకూడదు. ఒక బాబా తప్ప మరెవ్వరు లేరు పొరపాటున కూడా బుద్ధి రెండవవైపుకి వెళ్ళకూడదు. సదా మనస్సులో ఒక బాబా తప్ప మరెవ్వరు లేరు అనే మాట వస్తూ ఉండాలి దీనినే అఖండజపం అని అంటారు. విజయీరత్నాలు, ఓడించేవారే కానీ ఓడిపోయేవారు కాదు.

చాలా పరీక్షలు వస్తాయి. పరిక్ష రావటం అంటే తర్వాత తరగతికి వెళ్ళటం. పరిక్షలే లేకపోతే తరగతి ఎలా మారతారు? అందువలన పూర్తిగా పాస్ అవ్వాలి కేవలం పాస్ అవ్వటం కాదు. మాతలు ఎప్పుడు ఏడవటంలేదు కదా! కళ్ళలో ఎప్పుడైనా కన్నీళ్ళు నింపుకుంటున్నారా? నయనాలలో ఆత్మీయత వచ్చేసింది కనుక ఇప్పుడు కన్నీళ్ళు రావు. పాండవులు కళ్ళతో ఏడుస్తున్నారా? లేదా మనస్సుతో ఏడుస్తున్నారా? సుఖ సాగరునిలో లీనమైపోయినవారికి ఏడుపు ఎక్కడి నుంచి వచ్చింది? ఏడవటం అంటే దు:ఖానికి గుర్తు.

సుఖసాగరునిలో లీనమైన వారు ఎలా ఏడవగలరు? దు:ఖమనేది ఎప్పుడు కూడా కలలో కూడా రాకూడదు. కలలో కూడా సుఖస్వరూపులు ఎందుకంటే సుఖసాగరుడు మీ సమీప సంబంధంలోకి వచ్చేసారు. సదా సుఖంలో, సంతోషంలో ఉండండి ఎప్పుడూ ఏడవకూడదు. సత్యయుగంలో మీ ప్రజలు ఏడుస్తారా? కాబోయే రాజులు మరి ఎందుకు ఏడుస్తున్నారు? శక్తులు అనగా ఒక ఉదాహరణ. ఉదాహరణ అయిన మీరు ఏడుస్తూ ఉంటే మిమ్మల్ని చూసి వ్యాపారం ఎలా చేస్తారు? అందువలన ఎప్పుడూ ఏడవకూడదు. కళ్ళతోనూ ఏడవకూడదు, మనస్సుతో కూడా ఏడవకూడదు.

మీరైతే చిరునామా తెలియకుండా వెతికారు అందువలన వెతకటం కుదరలేదు కానీ బాబా అయితే మూలమూలల నుండి వెతికారు. అనేక వృక్షాల యొక్క కొమ్మలు ఇప్పుడు ఒకే వృక్షంగా అయ్యాయి. ఇద్దరు, ముగ్గురు మాతలు కలిసి ఒకచోట ఉండలేరని ప్రజలు అంటారు కానీ ఇక్కడ మాతలు విశ్వమంతటిలో ఐకమత్యాన్ని స్థాపన చేసే నిమిత్తులు.కలిసి ఉండలేరని వారంటారు కానీ మాతలే కలిసి ఉండగలరని బాబా అంటారు. మాతల కర్తవ్యం విశేషమైనది. ఓహో నా శ్రేష్టభాగ్యం అంటూ బాగా సంతోషంలో నాట్యం చేయండి, పాడండి. ఎప్పుడు కూడా దు:ఖం యొక్క అల రాకూడదు, అందరు దు:ఖధామాన్ని వదిలేసారు కదా!

ప్రవృత్తిలో ఉండేవారిని బాబా ఏ పుష్పంతో పోలుస్తారు? కమలపుష్పం. అయితే మీరు ప్రవృత్తిలో ఉంటూ కమలపుష్ప సమానంగా ఉంటున్నారా? ఎప్పుడైనా బురద యొక్క బిందువు పడటం లేదు కదా? మట్టి యొక్క ప్రభావం పడటం లేదు కదా? ప్రవృత్తిలో ఉండేవారు విశ్వాన్నంతటినీ కమలపుష్పాలతో నిండిన చెరువుగా చేసేయండి. చెరువులో కలవపువ్వులు బావుంటాయి కదా! ప్రపంచ పరిస్థితులు చూడండి మరియు మిమ్మల్ని మీరు చూస్కోండి, ఎంత తేడా ఉంది? ప్రాపంచిక ఎన్నో విషయాల నుండి, దు:ఖాల నుండి, బాధల నుండి విముక్తులయ్యారు. ఎలా ఉన్నారు అని ఎవరిని అడిగినా కానీ పరిస్థితి ఏమీ బాలేదు అని అంటారు. కానీ మీరు

సంతోషంగా ఉంటున్నారు. సంతోషంగా ఉంటున్నారా, పక్కాయేనా? ఎప్పుడూ సంతోషాన్ని తక్కువ చేసుకోకూడదు. గోపికలైన మాతలందరు గోపీ వల్లభునితో పాటు ఊయలలో ఊగేవారే కదా! అర్థకల్పం వరకు జడచిత్రాన్ని చాలా ప్రేమతో ఊపారు, ఇప్పుడు ఊపటం సమాప్తి అయిపోయింది, ఊగటం మొదలైంది. ఒకసారి సుఖం అనే ఊయలలో, ఒకసారి శాంతి అనే ఊయలలో .... ఇలా ఏదొక ఊయలలో ఊగుతూనే ఉండండి, క్రిందకి రాకండి. ఊయలంటే మాతలకు ఇష్టం కదా! పిల్లలను ఊపుతూ ఉంటారు కదా! భక్తిలో బాగా ఊపారు కానీ ఇప్పుడు భక్తికి ఫలం తీస్కోవాలి కదా! ఊపిన దానికి ఫలం ఊగటం. ఇప్పుడు లభించిన ఫలాన్ని తింటున్నారా లేక చూసుకుని మురిసిపోతున్నారా? మాతలు అన్నీ దాస్తారు కానీ తినే అలవాటు ఉండదు. కానీ ఇక్కడ ఎంత తింటారో అంత పెరుగుతుంది. స్మృతి శక్తిద్వారా సఫలత సహజంగా ప్రాప్తిస్తుంది. నిమిత్తమాత్రంగా లౌకికకార్యం చేస్తున్నా సంలగ్నత బాబా మరియు సేవపై ఉండాలి. లౌకికం కూడా సేవ కొరకే. మీ తగుల్పాటుతో చేయకూడదు. బాబా ఆజ్ఞానుసారం చేస్తున్నారు కనుక బాబా స్నేహం యొక్క చేయి సదా పిల్లలతో పాటు ఉంటుంది. మీరు సంతోషంలో ఉండండి, మీ సంతోషం చూసి ఇతరులు కూడా సంతోషం అయిపోతారు దీని ద్వారా కూడా సేవ జరుగుతుంది.

## ఒంటరిగా ఉండే మాతలతో ...

మీరు ఒంటరివారు కాదు, మీ తోడు చాలా శక్తివంతుడు. బాప్‌దాదా పిల్లలందరికీ చెప్తూ ఉంటారు - మీరు మరియు బాబా కంబైండ్ అని. కంబైండ్ అయినప్పుడు ఒంటరివారు ఎలా అయ్యారు? లౌకిక జీవితం అనేది వేరేవిషయం కానీ బ్రాహ్మణ జీవితంలో మీరు కంబైండ్ రూపం. ఎంత కంబైండ్ అంటే ఎవరూ మిమ్మల్ని వేరుచేయలేరు. ఇలా కంబైండ్‌యేనా లేక ఒంటరివారా? ఎప్పుడూ కూడా మిమ్మల్ని మీరు ఒంటరిగా భావించటం లేదు కదా! బాబా అనగానే బాబా హాజరు అయిపోతారు. మరి ఆనందంలో ఉంటున్నారు కదా, ఉదాశీనం అవ్వటం లేదు కదా! నేను బాబా కంబైండ్ అని ఆత్మిక నషాలో ఉండండి. మీరు అతిప్రియం కంటే ప్రియమైనవారు. బాప్‌దాదా అబలల నుండి శక్తులుగా తయారుచేశారు కనుక శక్తులకు విజయోస్తు, విజయోస్తు, విజయోస్తు. విజయానికి గుర్తుగా శక్తులకు శస్త్రాలు చూపించారు. ఇప్పుడిక మిమ్మల్ని మీరు అబలగా భావించటం లేదు కదా, శక్తులు మీరు. శస్త్రధారి శక్తులు అనగా సర్వ శక్తులను ధరించిన శక్తులు. కనుక సదా స్వయాన్ని సర్వశక్తి స్వరూపంగా అనుభవం చేస్కోండి.

మాతలు అలజడి అవ్వటం లేదు కదా? సర్వశక్తివంతుడు మీ తోడుగా ఉన్నప్పుడు భయం ఎందుకు? ఒంటరిగా భావిస్తేనే అలజడిలోకి వస్తారు. కంబైండ్‌గా ఉంటే ఎంత అలజడిగా ఉన్నా కానీ అచంచలంగా ఉంటారు. భాధ్యత బాబాది, మీ స్థితిలో మీరు స్థితులై ఉంటే బాధ్యత బాబాది, అలజడి అయితే మీదే భాధ్యత.

## బంధనాలలో ఉన్న మాతల కోసం ...

బంధనాలలో ఉన్నవారి యొక్క స్మృతి సదా బాబాకి చేరుకుంటూ ఉంటుంది. బంధనాలలో ఉన్నవారందరికీ బాప్‌దాదా చెప్తున్నారు- యోగం అనగా స్మృతిని అగ్ని రూపంగా చేసుకోండి ఎప్పుడైతే సంలగ్నత అగ్ని రూపంలో ఉంటుందో దానిలో అన్నీ భస్మం అయిపోతాయి. ఆ సంలగ్నత అగ్నిలో ఈ బంధన కూడా సమాప్తమైపోతుంది మరియు స్వతంత్రాత్మ అయ్యి ఏ సంకల్పం చేస్తారో దాని సిద్ధిని పొందుతారు. స్నేహీలు స్నేహం యొక్క స్మృతి బాబా దగ్గరకు చేరుకుంటుంది ఆ స్నేహానికి ఫలితంగా బాబా నుండి స్నేహం లభిస్తుంది కానీ ఇప్పుడు స్మృతిని శక్తిశాలి అగ్నిరూపంగా చేసుకోండి అప్పుడు బాబా సన్ముఖంగా వచ్చే రోజు రానే వస్తుంది.

బంధన వేసే ఆత్మ కూడా మీ పురుషార్ధంలో సహయోగి. బంధన ద్వారా కోరిక ఇంకా పెరుగుతుంది కనుక బంధన బంధన కాదు సహయోగం అయ్యింది కదా! ఇలా సహయోగం యొక్క దృష్టితో చూస్తే మజా వస్తుంది. బంధనను బంధన అనే దృష్టితో చూస్తే బలహీనం అయిపోతారు.

## వృద్ధ మాతల కొరకు సహజ ఉపాయం !

మాతల కొరకు బాప్‌దాదా ఏ సహజ మార్గం చెప్పారు? దీని ద్వారా వారు సహజంగానే బాబా స్మృతిని అనుభవం చేసుకోగలరు, శ్రమించవలసిన అవసరం ఉండదు. స్మృతిని కూడా సహజం చేసుకునే సహజ సాధనం ఏది? మనస్సుతో అనండి - నా బాబా! నావారు అన్నప్పుడు స్మృతి సహజంగా ఉంటుంది. రోజంతటిలో మనవారు ఎవరైతే ఉంటారో వారే గుర్తు వస్తుంటారు కదా! నాది అనేది ఏది అయినా జ్ఞాపకం వస్తుంది అంటే వ్యక్తులైనా లేదా వస్తువులైనా. అదేవిధంగా బాబాను కూడా నావారు అనుకుని నా బాబా అనుకుంటే బాబాయే జ్ఞాపకం వస్తారు. కనుక బాబాని జ్ఞాపకం చేసుకోవడానికి సహజ సాధనం మనస్సుతో అనండి - నా బాబా! కేవలం

నోటితో నా బాబా, నా బాబా అనటం కాదు, అధికారంతో అనాలి. ఇదే సహజ పురుషార్ధంతో ముందుకి వెళ్తూ ఉండండి. సదా ఈ విధి ద్వారా సహజ యోగి అవ్వండి. నా బాబా అనండి మరియు బాబా యొక్క ఖజానాలకు యజమాని అవ్వండి. మాతల కొరకు విశేషంగా బాప్‌దాదా సహజమార్గం యొక్క బహుమతిని తీసుకువచ్చారు. సహజమార్గం యొక్క బహుమతి అందరికీ లభించింది. సహజప్రాప్తియే బహుమతి. అన్నింటికంటే సహజంగా నా బాబా అనండి చాలు. నా బాబా అనటం ద్వారా, అనుభవం చేసుకోవటం ద్వారా సర్వప్రాప్తులు లభిస్తాయి.

## మీ కుటుంబీకుల గురించి ఆలోచించండిలా !

అలౌకికజీవితం అంటే సదా అతీతస్థితి. వారిలాగే మీరు కూడా మాట్లాడుతూ, నడుస్తూ గృహస్థంలో ఉంటే వారికి, మీకు తేడా ఏమిటి? ఎంత పరివర్తన అయ్యాను? అని మిమ్మల్ని మీరు చూసుకోండి. లౌకిక సంబంధంలో కోడలు అయినా, అత్తగారు అయినా కానీ ఆత్మను చూడండి. కోడలు కాదు, ఒక ఆత్మ. ఆత్మను చూడటం ద్వారా దయ వస్తుంది. ఈ ఆత్మ అజ్ఞానంలో ఉంది, నేను జ్ఞానీఆత్మను ఈ ఆత్మపై దయ చూపించి శుభభావనతో మార్చి చూపిస్తాను అనాలి. ఇలా వృత్తి,దృష్టిని మార్చుకోండి. లేకపోతే కుటుంబంలోని వారిపై మీ ప్రభావం పడదు.వృత్తి మరియు దృష్టిని మార్చుకోవటమే అలౌకిక జీవితం. అజ్ఞానులు చేసే పనే మీరూ చేయకూడదు. మీ సాంగత్యం యొక్క రంగు అంటించాలే కానీ వారి సాంగత్యం యొక్క రంగు మీకు అంటకూడదు. జ్ఞానీఆత్మ అయిన మీ ప్రభావం ఆ అజ్ఞాని ఆత్మపై పడటం లేదు అంటే శుభ భావన లేదు. చెప్పటం ద్వారా ప్రభావం పడదు, సూక్ష్మ భావనకి ఫలితం లభిస్తుంది.

సదా లౌకికంలో అలౌకిక స్మృతి, సదా సేవాధారి స్మృతి ఉండాలి. సదా నిమిత్తభావం యొక్క స్మృతి ఉండాలి. సర్వుల పట్ల ఆత్మికభావం, శుభకళ్యాణ భావన, శ్రేష్ఠంగా తయారుచేయాలనే శుభభావన ఉండాలి. ఇతరాత్మలను ఎలా అయితే సేవాభావంతో చూస్తారో, మాట్లాడతారో అలాగే నిమిత్తంగా అయిన లౌకిక పరివారం యొక్క ఆత్మలను కూడా ఆరకంగా నడిపిస్తూ ఉండండి. నా పిల్లలు, నా పతి యొక్క కళ్యాణం జరగాలి అని హద్దులోకి రాకండి. సర్వుల కళ్యాణం జరగాలి. నాది అనే భావం ఉంటే ఆత్మికదృష్టి, కళ్యాణకారి దృష్టిని ఇవ్వలేరు. ఎక్కువ మంది బాప్‌దాదా ముందు ఇదే ఆశను పెడుతున్నారు, పిల్లలు మారిపోవాలి, భర్త సహకరించాలి, ఇంట్లో వాళ్ళు తోడు అవ్వాలి అని కానీ ఆ ఆత్మలనే మీ వారిగా భావించి ఈ ఆశ ఎందుకు పెట్టుకుంటున్నారు? ఈ హద్దు యొక్క గోడ కారణంగా మీ శుభభావన లేదా కళ్యాణం యొక్క శుభకోరిక ఆ ఆత్మల వరకు చేరుకోవటంలేదు. సంకల్పం మంచిదే కానీ సాధన యదార్ధమైనది కాకపోతే ఫలితం ఎలా

వస్తుంది? అందువలన సదా బేహద్ ఆత్మికదృష్టి, సోదర సంబంధం యొక్క వృత్తి ద్వారా ఏ ఆత్మ పట్ల అయినా శుభభావన పెట్టుకుంటే ఫలం తప్పకుండా లభిస్తుంది. అందువలన పురుషార్ధంతో అలసిపోకండి. చాలా శ్రమించాను, వీరు ఇక మారరు అని మానసికంగా బలహీనం అవ్వకండి. నిశ్చయబుద్ధి అయ్యి నా వారు అనే సంబంధం నుండి అతీతమై నడవండి, కొంతమంది ఆత్మలకు ఈశ్వరీయ వారసత్వం తీసుకునేటందుకు భక్తి యొక్క కర్మలఖాతా పూర్తవటంలో కొంచెంసమయం పడుతుంది అందువలన ఓర్పు వహించి సాక్షి స్థితిలో స్థితులవ్వండి, నిరాశ అవ్వకండి. శాంతి మరియు శక్తి యొక్క సహయోగాన్ని ఆత్మలకు ఇస్తూ ఉండండి. ఇటువంటి స్థితిలో స్థితులై లౌకికంలో అలౌకిక భావన ఉంచుకునే డబల్ సేవాధారి నిమిత్త పిల్లల యొక్క మహత్యం చాలా గొప్పది.

పిల్లలపై అప్పుడప్పుడు కోప్పడటం లేదు కదా? పిల్లలు అంటున్నారు. పిల్లలు అంటే అమాయకులు. పిల్లలు అంటే చంచలం. చంచలస్వభావం కలిగిన అమాయక పిల్లలతో కోపం ఎందుకు? ఇప్పటి పిల్లలు కలియుగీ పిల్లలు, తమోగుణీ రచన కనుక చంచలంగానే ఉంటారు ఈ రహస్యం మీకు తెలుసు కదా! మట్టి ఎలాంటిదో కుండ అలా ఉంటుంది. మట్టి వేడిగా ఉంటే కుండలో నీరు చల్లగా ఎలా ఉంటుంది? కనుక వారిపై కోప్పడటం కూడా జ్ఞానవంతులు కానట్లే, రహస్యం తెలుసుకోలేదు మీరు. యోగయుక్తులై వారికి శిక్షణనిస్తే పరివర్తన అయిపోతారు. అంతేకానీ కోప్పడకూడదు.

## ప్రవృత్తిలో ఉంటూ గీతాపాఠశాల నడిపించే వారితో ...

ప్రవృత్తిని కూడా సంభాళించుకుంటున్నారు మరియు అలౌకిక సేవకు కూడా నిమిత్తమయ్యారు అంటే రెండు పనులు చేస్తున్నారు. గీతాపాఠశాలకు నిమిత్తమైన ఆత్మల యొక్క విశేషత ఏమిటంటే స్వయాన్ని సదా నిమిత్తంగా భావించి నడవండి. ఎందుకంటే బాప్‌దాదా చూశారు, గీతాపాఠశాలలు తెరిచేవారు రకరకాల భావనలతో తెరుస్తున్నారు. కొందరు సత్యమైన మనస్సుతో సేవాభావంతో తెరుస్తున్నారు లేదా నడుస్తున్నారు కానీ అది వృద్ధి అయిన తర్వాత అక్కడక్కడ కోందరి భావనలలో కల్తీ వచ్చేస్తుంది. బాప్‌దాదా చూశారు, అక్కడక్కడ కొందరు తమ కుటుంబ పాలన కోసం కూడా గీతాపాఠశాలలు తెరుస్తున్నారు. నిమిత్తంగా సేవ అవుతుంది, కుటుంబ పాలన జరుగుతుంది అని అనుకుంటున్నారు. కానీ గీతాపాఠశాల అంటే నిమిత్తంగా అయ్యి సేవ చేయటం, ఎందుకంటే వచ్చేటటువంటి ఆత్మలు బాబా యొక్క స్నేహం కోసం వస్తారు కనుక నిమిత్తంగా అయ్యి కార్యవ్యవహారం నడిపించటం అవసరం. పూర్తిగా నిస్వార్ధ సేవా భావం కలిగినదే సత్యమైన గీతాపాఠశాల. శుభ భావనతో సేవకి నిమిత్తమై నడిచే ఆత్మలను చూసి బాప్‌దాదా

సంతోషిస్తున్నారు ఎందుకంటే సమయాన్ని సఫలం చేసుకుంటున్నారు. శుద్ధ భావనతో డబల్ కార్యాన్ని సంభాళిస్తున్నారు. పేరు కోసం కానీ, లౌకిక కుటుంబ పాలన కోసం కానీ ఇతర ఏ భావం వారికి లేదు. అటువంటి నిమిత్త ఆత్మలకు చాలా చాలా చాలా శుభాకాంక్షలు. మంచివారు మరియు మంచిగానే ఉంటారు కానీ పరిశీలించుకోండి – ఇతర ఏ భావం యొక్క కల్తీ జరగటం లేదు కదా? సేవాభావం తప్ప మరే ఇతర భావాన్ని రానివ్వకూడదు. ప్రవృత్తి వారిని చూసి ప్రవృత్తిలోని వారికి ధైర్యం వస్తుంది. సెంటర్లో ఉండేవారిని చూసి మేము కూడా ఇవన్నీ వదిలేయాల్సి ఉంటుందేమో అని అనుకుంటారు కానీ ప్రవృత్తిలో ఉంటూ సేవ చేసే పిల్లలను చూసి ప్రవృత్తిలో ఉండేవారికి ధైర్యం, ఉత్సాహ ఉల్లాసాలు వస్తాయి.

ఆదిలో వృద్ధికి ఎక్కువమంది శక్తులే నిమిత్తమయ్యారు. పాండవులు తక్కువమంది. అవసరానికి బాబాకి సహయోగి అయిన ఆత్మలకు ఏ వేళలోనైనా కష్టం కలిగితే బాప్‌దాదా వారికి సహాయం చేస్తారు. మాతల యొక్క బిందువు, బిందువు ద్వారానే స్థాపనాకార్యం ప్రారంభమైంది. ఇప్పుడు సఫలతకి చేరువలో ఉన్నారు. మాతల దగ్గర హృదయం యొక్క సంపాదన ఉంటుంది, వ్యాపార సంపాదన కాదు. హృదయం యొక్క సంపాదన ఒక రూపాయి వేయి రూపాయిలతో సమానం. పాండవులు కూడా ఉన్నారు, పాండవులు లేకుండా కూడా కార్యం జరగదు కానీ మాతల సంఖ్య ఎక్కువ. అందువలనే పంచపాండవులు అని వ్రాశారు.

కుటుంబంలో ఉండేవారికి బాప్‌దాదా ఒక విషయం గురించి శుభాకాంక్షలు ఇస్తున్నారు. ఎప్పటి నుండి అయితే కుటుంబంలో ఉండేవారు సేవలో సహయోగి అయ్యారో అప్పటి నుండి బాబా పేరు ప్రఖ్యాతి అవుతుంది. మొదట్లో అయితే ప్రజలు అనుకునేవారు – బ్రహ్మాకుమారీలు, కుమారులు అంటే ఇల్లు వాకిలి వదిలేయాలి అని భయపడేవారు. కానీ ఇప్పుడు అయితే మిమ్మల్ని చూసి వీరు ఇల్లు బావుంది, వ్యాపారం కూడా బాగా నడుస్తుంది, అంతా సంతోషంగా ఉంటున్నారు మేము కూడా ఇలా అవ్వవచ్చు అని అనుకుంటున్నారు. అంటే మీరు ఉదాహరణ అయినట్లు కదా! మొదట్లో అయితే మేము మీలా అవ్వటం కష్టం అనేవారు కానీ ఇప్పుడు పవిత్ర ప్రవృత్తిలో ఉంటే మంచిది అంటున్నారు. ఇలా సేవ వృద్ధి అవ్వడానికి మీరు నిమిత్తమయ్యారు కనుక శుభాకాంక్షలు.

# వందేమాతరం

బాప్‌దాదా మాతలకు నమస్కరిస్తారు ఎందుకంటే మాతలు సేవ కొరకు అడుగు ముందుకు వేసారు. స్వయంగా బాప్‌దాదా మాతల గుణాలను పాడుతున్నారంటే మీరు ఎంత శ్రేష్టమాతలు!

మీరు శివశక్తులు, శక్తి అనగా సంహారిణి, విజయీ !

జగత్తుని ఉద్ధరించే జగన్మాతలు మీరు !

శివబాబాతో పాటు పాత్రను అభినయించేవారు మీరు!

పదమాపద భాగ్యశాలులు మీరు !

గోపీవల్లభునితో పాటు ఉండే గోపికలు మీరు !

శస్త్రధారి పూజ్యులు మీరు !

బాబా యొక్క శిరోకిరీటాలు మీరు !

మీ బిరుదు – కళ్యాణి !

దయాహృదయులు మీరు !

బాబాకి విశేష సహాయకారులు మీరు !

ప్రత్యక్షతా జెండాను ఎగురవేసేవారు మీరు !

రాజ్యం మీది, భాగ్యం మీది, భగవంతుడు మీవారు !

భోళానాధుని యొక్క మధురాతి మధుర మాతలు మీరు !

సేవాకేంద్రానికి అలంకారం మీరు !

కమలపుష్ప సమానులు మీరు !

సింహంపై ఆసీనులయ్యే నిర్భయులు మీరు !